మెడికల్ కాలేజీలో 19న ఇంటర్వ్యూలు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ, అనుబంధ జనరల్ ఆస్పత్రిలో వివిధ పోస్టుల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 19న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు తెలిపారు. డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల మెడికల్ కాలేజీలో ఇంటర్వ్యూలు ప్రారంభమవుతాయని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని సూచించారు.

రోడ్ల విస్తరణకు రూ.293 కోట్లు

సింగూరు టూరిజం అభివృద్ధికి రూ.100 కోట్లు

రూ.600 కోట్లతో యంగ్ ఇండియా గురుకులాలు

రూ.910.40 కోట్ల రైతు రుణాలు మాఫీ

14,391 మందికి ఇందిరమ్మ ఇళ్లు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డిలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సంగారెడ్డిక్రైం/సంగారెడ్డిటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రోడ్ల అనుసంధానంలో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రూ. 293కోట్లతో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. సంగారెడ్డిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జెండా ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఈ సంవత్సరం జిల్లాలో వివిధ రహదారుల మరమ్మతుల కోసం రూ. 22కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సింగూరు పంట కాల్వల సీసీ లైనింగ్‌కు రూ.168 కోట్లు, టూరిజం అభివృద్ధికి రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు. నార్కోటిక్ అనాలిసిస్ బ్రాంచ్ ద్వారా జిల్లాలో మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతున్నామని చెప్పారు. అందోల్, నారాయణఖేడ్, పటాన్‌చెరు నియోజకవర్గాల్లో రూ.600 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నిర్మించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ సంవత్సరం జిల్లాలో 1,264 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందజేసినట్లు తెలిపారు. రాయికోడ్, నారాయణఖేడ్, జహీరాబాద్ మండలాల్లో రూ. 107కోట్లతో మూడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం 11,691 మందికి శస్త్ర చికిత్సలకు 35.15 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. సంగారెడ్డిలో త్వరలో మెడిక్ కాలేజ్ భవనం ప్రారంభోత్సవం, 500 పడకల జనరల్ ఆసుపత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు.

పేదలకు సన్నబియ్యం, కొత్త రేషన్‌కార్డులు

ఆహార భద్రత పథకం కింద జిల్లాలో 846 రేషన్ దుకాణాల ద్వారా 13,08,489 సభ్యులకు ప్రతీనెల ఉచితంగా 8,345 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. కొత్తగా 31,460 రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు చెప్పారు. జిల్లాలో 14,391 మందికి ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే 2,791 మంది లబ్ధిదారులకు రూ.28.58 కోట్లు ఖాతాలో జమ చేసినట్లు వివరించారు. గృహజ్యోతి పథకం కింద 2.11లక్షల గృహాలకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 3.628 కోట్ల మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించారని పేర్కొన్నారు. సంగారెడ్డిలో మహిళా పెట్రోల్ బంక్ విజయవంతంగా కొనసాగుతోందన్నారు.



రైతు సంక్షేమానికి ప్రాధాన్యం

రైతు సమస్యల పరిష్కారానికి జిల్లాలో 596 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. రైతుబీమాలో భాగంగా 1,400 మంది రైతు కుటుంబాలకు రూ. 70కోట్లు జమ చేసినట్లు వివరించారు. రైతు భరోసా కింద ఈ వానాకాలం సీజన్‌కు 3,58,863 మంది రైతులకు రూ.422 కోట్లు సాయం అందజేసినట్లు తెలిపారు. పంట రుణమాఫీ కింద 1,04,416 మంది రైతు కుటుంబాలకు రూ. 910.40కోట్ల రుణాల మాఫీ చేసినట్లు మంత్రి వివరించారు. గత యాసంగి సీజన్‌లో 218 కొనుగోలు కేంద్రాల ద్వారా 14,73,808 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 28,808 మంది రైతుల ఖాతాల్లో రూ. 341.92కోట్లు జమ చేసినట్లు వివరించారు.

అంతకుముందు వేడుకల్లో భాగంగా పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ శాఖల శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేడుకల్లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, కలెక్టర్ పి.ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



స్వాతంత్ర్య దిన వేడుకల్లో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న మంత్రి దామోదర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి పారితోషికం అందజేస్తున్న మంత్రి దామోదర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి

స్వాతంత్ర్య దిన వేడుకల్లో నిర్మలా జగ్గారెడ్డి


సంగారెడ్డిటౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం నాడు నిర్వహించిన 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో మంత్రి దామోదర్‌తో పాటు టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. మంత్రితో కలిసి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో అలరించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి సత్కరించారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినికి ప్రభుత్వం నుంచి మంజూరైన పారితోషం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మెతుకుసీమ ముందంజ

త్యాగధనులకు జోహార్లు..
వారి వల్లనే స్వాతంత్ర్యం
జిల్లా ఇన్‌చార్జి మంత్రి
వివేక్ వెంకటస్వామి



మెదక్‌లో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి వివేక్ వెంకటస్వామి



మెదక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మెతుకుసీమ అన్ని రంగాల్లో అగ్రపథంలో నడుస్తున్నదని ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీసు పేరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం 79వ స్వాతంత్ర్య వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ జెండాను ఎగురవేసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లాలో కొనసాగుతున్న ప్రగతి నివేదికను వివరించారు. జిల్లా మహిళలు ఇప్పటివరకు 3.02 కోట్ల సార్లు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకున్నారని, దీని ద్వారా రూ. 83.50కోట్ల మేర లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ పథకంలో భాగంగా 1,27,393 మంది వినియోగదారులకు రూ. 65.03కోట్ల సబ్సిడీ అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ వానాకాలం సీజన్‌లో 2,62,043 రైతుల ఖాతాల్లో రూ. 220.84 కోట్లు పెట్టుబడి సాయం జమ చేసినట్లు వివరించారు. రైతు రుణమాఫీ కింద 87,491 మంది రైతులకు రూ. 645.41కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద 18,626 మందికి రూ.49.71 కోట్ల మేర ఉచిత వైద్యసేవలు అందజేసినట్లు తెలిపారు. జిల్లాకేంద్రంలో కొత్త మెడికల్ కాలేజీ భవనం కోసం రూ.180 కోట్లు, నర్సింగ్ కళాశాల భవనానికి రూ.26 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1,26,796 మంది వినియోగదారులకు 4,68,195 గ్యాస్ సిలిండర్లను రూ.500కు పంపిణీ చేసినట్లు తెలిపారు. రేషన్ దుకాణాల ద్వారా 2,16,716 కుటుంబాలకు మూడు నెలలకు 13,923 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఉచితంగా పంపిణీ చేశామని వివరించారు. జిల్లాలో కొత్తగా 9,964 రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. గత యాసంగిలో 80,873 మంది రైతుల నుంచి 3,19,144 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్లను కొనుగోలు చేసి, రూ. 740.42కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. 14,994 మంది రైతుల నుంచి 62,747 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించినట్లు తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల మరమ్మతుల కోసం రూ. 3.26 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రూ.200 కోట్లతో జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలో 9,125 మందికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని తెలిపారు. ఏడుపాయల వనదుర్గ ఆలయ అభివృద్ధి కోసం రూ.35 కోట్లు మెదక్ చర్చి అభివృద్ధికి రూ.29.18కోట్లు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ శ్రీనివాస్‌రావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకిషన్, డీఏవో దేవ్‌కుమార్, డీఎంహెచ్‌వో శ్రీరామ్, అధికారులు పాల్గొన్నారు.

- మెదక్ ఏఆర్‌హెడ్ క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వంశీకి హైదరాబాద్‌లో స్వాతంత్ర దినోత్స వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి గ్యాలేంట్రీ మెడల్‌ను అందజేశారు.





సంగారెడ్డిలో సాంస్కృతిక నృత్యాలు, విన్యాసాలు ప్రదర్శిస్తున్న పాఠశాల విద్యార్థులు





మెదక్‌లో సాంస్కృతిక ప్రదర్శన చేసిన విద్యార్థులతో మంత్రి వివేక్ వెంకటస్వామి, నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

భారీ వర్షం.. ఆగమాగం

మెదక్ జిల్లాలో దంచికొట్టిన వాన

పొంగిపొర్లిన వాగులు, వంకలు

జనజీవనం అస్తవ్యస్తం

జలాశయాలు, చెరువుల్లోకి నీరు



రేగోడు మండలం జగిర్యాలలొ అలుగు పారుతున్న చెరువు

న్యూస్ నెట్‌వర్క్ (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు నిండి అలుగులు పారుతున్నాయి. పలు చోట్ల పంట పొలాలు నీట మునిగాయి, ఇళ్లు కూలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై సహాయక చర్యలు చేపట్టింది.

మెదక్ జిల్లాలో భారీ వర్షం

మెదక్ జిల్లాలోనే అత్యధికంగా టేక్మాల్ మండలంలో 196.5 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. గుండువాగు ఉధృతంగా ప్రవహించి పంట పొలాలు, రోడ్ల మీదకు నీరు చేరింది. టేక్మాల్‌జోగిపేట ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. తంపులూరులో రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. పోగులంపల్లి చెరువుకు గండిపడింది.


- అల్లాదుర్గం మండలంలో 137.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముప్పారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీ కూలిపోయింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. పంట పొలాలు మునిగిపోయి, ప్రధాన రహదారులపై నీరు నిలిచిపోయింది.
- రేగోడు మండలంలో 106.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కుంటలు, చెరువులు నిండి అలుగు పారుతున్నాయి. కొండాపూర్-జగిర్యాల చెరువు నిండి అలుగు పారుతుండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రయాణికులను అప్రమత్తం చేశారు. రేగోడు ఊరకుంట కట్టకు గండి పడటంతో నీరు వృధాగా పోతోంది. ఒక ఇల్లు కూలిపోయింది.
- పెద్దశంకరంపేట మండలంలో 60.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బూర్గుపల్లి కట్టం చెరువు పొంగిపొర్లి, ఇస్రానాయక్ తండాకు వెళ్లే సీసీ రోడ్డు కూలిపోయింది.
- చిలప్‌చేడ్ మండలంలో 154 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. పలు గ్రామాల్లో వరి, పత్తి చేలు నీట మునిగాయి.
- నర్సాపూర్‌లో గురువారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం కొంత తెరిపినిచ్చినట్లే కనిపించినా రాత్రి 7 గంటల నుంచి మరోసారి దంచికొట్టింది. పట్టణంలోని 9వ వార్డులో లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిలిచింది.
- కౌడిపల్లి మండలం రాజీపేట, జాజి తండా మధ్య ఉన్న రామలక్ష్మణ వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు రెండు గంటలు నిలిచిపోయాయి.
- మనోహరాబాద్ మండలంలో ఒక ఇంటి స్లాబ్ కూలిపోయింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.
- పాపన్నపేట మండలం ఏడుపాయల వద్ద మంజీరా నది ఉగ్రరూపం దాల్చింది. సింగూర్ ఆనకట్ట నుంచి వరదలు వదలడంతో ఘనపురం ఆనకట్ట పొంగిపొర్లి వనదుర్గామాత ఆలయం జలదిగ్బంధంలో చిక్కుకుంది. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రాజెక్టును పరిశీలించి, ఏడుపాయల వద్ద పరిస్థితిని పరిశీలించారు. అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రజల భద్రత కోసం ఎస్ఆర్‌డీఎఫ్ బృందాన్ని మోహరించారు.

సంగారెడ్డి జిల్లాలో వర్షం పరిస్థితి

సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా నారాయణఖేడ్ డివిజన్‌లో భారీ వర్షం కురిసింది. మండలాలవారీగా నారాయణఖేడ్‌లో 74.8 మి.మీ., నాగల్‌గిద్దలో 65 మి.మీ., సిర్గాపూర్‌లో 62.4 మి.మీ., మనూరులో 56.8 మి.మీ., కంగ్టిలో 51 మి.మీ., నిజాంపేటలో 40.6 మి.మీ., కల్హేర్‌లో 32.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు, లోలెవల్ కాజ్‌వేలు పొంగిపొర్లాయి. నారాయణఖేడ్-మన్సూర్‌పూర్ మధ్య లోలెవల్ కాజ్‌వేపై భారీగా నీరు ప్రవహించింది. కొట్టుకొచ్చిన చెట్లను మున్సిపల్ అధికారులు తొలగించి రాకపోకలకు అంతరాయం కలగకుండా చూశారు. గంగాపూర్ ప్రాజెక్టు, వెంకటాపూర్ పెద్ద చెరువు నిండుకుండలా మారాయి. నల్లవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 1493 అడుగులకు గాను, ప్రస్తుతం 1486 అడుగులకు చేరుకుంది. నాగల్‌గిద్ద మండలం శ్యామ తండా నుంచి సక్రునాయక్ తండా రోడ్డుపై వరద నీరు ప్రవహించింది.



అల్లాదుర్గంలో వరద నీరు ప్రవహిస్తుండటంతో చెరువును తలపిస్తున్న వరి పొలాలు



ఏడుపాయలలో మంజీరా ఉధృతి



నాగల్‌గిద్ద మండలం శ్యామ తండా-సక్రు తండా మధ్య రోడ్డుపై పారుతున్న వరద

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- ప్రియుడితో కలిసి కొడుకును చంపిన తల్లి
- తొమ్మిది నెలల క్రితం ఘటన

తూప్రాన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని చేతికి అందివచ్చిన కొడుకును ప్రియుడితో కలిసి దారుణంగా హత్య చేసిందో తల్లి. మద్యం తాగించి తాడు, చున్నీతో గొంతు బిగించి చంపేసి.. మృతదేహాన్ని సమీపంలోని హల్దీవాగులో పడేశారు. తొమ్మిది నెలల క్రితం ఈ హత్య జరగగా, తల్లే హత్య చేయడం.. ఎక్కడా మిస్సింగ్ కేసు కూడా నమోదు కాకపోవడం, ఎలాంటి ఆధారాలూ దొరకక కేసు మూసివేసే దశకు చేరుకుంది. చివరికి సాంకేతిక ఆధారాలతో హత్యకు గురైన యువకుడిని గుర్తించి, కేసును ఛేదించారు. తూప్రాన్ డీఎస్పీ జే నరేందర్‌రెడ్డి, సీఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎస్సై శివానందంతో కలిసి శుక్రవారం కేసు వివరాలను వెల్లడించారు. తూప్రాన్ మండలం వెంకటాయపల్లికి చెందిన మహమ్మద్ రహేనా వివాహం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మక్తామైలారానికి చెందిన జహంగీర్‌తో జరిగింది. వారికి కుమారుడు పుట్టిన అహ్మద్ పాషా అలియాస్ పాషా(25) పుట్టిన ఏడాదికే జహంగీర్ మృతి చెందాడు. దీంతో రహేనా కుమారుడిని తీసుకుని వెంకటాయపల్లికి వచ్చి ఉంటోంది. కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లగా, ఆమెకు మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లికి చెందిన కందాల బిక్షపతితో వివాహేతర సంబంధం ఏర్పడింది. కొన్నాళ్లకు రహేనా, కొడుకుతో కలిసి మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు వచ్చి నివాసం ఉంది. కొడుకు పాషాకు వివాహం కాగా, కలహాలతో భార్య నెల రోజుల్లోనే విడాకులు తీసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తల్లికొడుకులు కలిసి ఉంటున్నారు. అయితే, తన వివాహేతర సంబంధానికి కొడుకు అడ్డుగా ఉన్నాడని రహేనా భావించింది. ఎలాగైనా అడ్డుతొలగించుకోవాలని ప్రియుడితో కలిసి పథకం వేసింది. గతేడాది నవంబర్ 27న కొడుకు, ప్రియుడితో కలిసి తన స్వగ్రామమైన వెంకటాయపల్లికి బయలుదేరింది. తూప్రాన్ పట్టణ పరిధి అంబోతుపల్లి వద్ద ముగ్గురూ కలిసి మద్యం తాగారు. మత్తులో ఉన్న పాషాను తల్లి రహేనా, ఆమె ప్రియుడు బిక్షపతి కలిసి తాడు, చున్నీతో గొంతు బిగించి చంపేశారు. మృతదేహాన్ని సమీపంలోని హల్దీవాగులో పడేశారు. అదే నెల 28న పోలీసులు వాగులో మృతదేహాన్ని గుర్తించి, గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేశారు. అయితే, చనిపోయిన యువకుడికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాకపోవడం, తల్లి ప్రియుడితో కలిసి వెళ్లిపోవడంతో కేసులో ఎలాంటి ఆధారాలు లభించలేదు. అయితే, సాంకేతిక ఆధారాలతో మృతుడిని గుర్తించిన పోలీసులు ఈ కేసులో తల్లి రహేనా, ఆమె ప్రియుడు కందాల బిక్షపతిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా, నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. ఇద్దరిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మైత్రి డ్రగ్స్‌పై రైతుల ఆగ్రహం

గుమ్మడిదల, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మండలం బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని మైత్రి డ్రగ్స్ పరిశ్రమపై రైతులు ధర్నా చేశారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాలు వర్షపు నీటితో కలిసి తమ పంట పొలాల్లోకి చేరి పంటను నాశనం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా పరిశ్రమ యాజమాన్యం, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. రసాయన జలాల వల్ల వరి పంట పూర్తిగా దెబ్బతిందని ఆరోపిస్తూ, బాధిత రైతులు పరిశ్రమ గేటు ఎదుట ధర్నాకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ పరమేశం, ఎస్సై



రసాయన జలాలతో పంట నాశనమైందంటూ న్యాయం చేయాలని పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

లక్ష్మీకాంత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. పీసీబీ అధికారులను పిలిపించి రసాయన జలాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. రైతులకు న్యాయం చేస్తామని, నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు.

పేదల హక్కుల కోసం ఎంతవరకైనా పోరాడుతా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

కంగ్టి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పేదవర్గాలు, పెన్షన్‌దారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు పేదల పక్షాన ఎంతవరకైనా పోరాటం చేసేందుకు తాను వెనుకడుగు వేసే ప్రసక్తే లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల పరిధిలోని తడ్కల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పెన్షన్‌దారుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతులు, చేనేత కార్మికుల పెన్షన్లు పెంచుతామని, అధికారంలోకి వచ్చిన మరుసటి నెల నుంచే వీటిని అమలు చేస్తామని చెప్పినప్పటికీ, అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. దాదాపు 50 లక్షల మంది ఫింఛన్‌దారుల పొట్టన సీఎం రేవంత్‌రెడ్డి మట్టికొట్టారన్నారు. ఫింఛన్‌దారుల ఓట్లతో గద్దెనెక్కిన సీఎం వారిని విస్మరించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు అవుతున్నా పెన్షన్ల ఊసే లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రి నెలనెల జీతాలు తీసుకుంటున్నప్పటికీ, ఫింఛన్‌దారుల ఫింఛన్ల పెంపు మాటమరిచారన్నారు. ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపిస్తున్నా సీఎం ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదా, పాలకులు జీతాలు తీసుకోవడం లేదా నిలదీశారు. పెన్షన్‌దారులకు దక్కాల్సిన రూ.20 కోట్లను భూస్వాములకు పంచిపెట్టారని ఆరోపించారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్య

పాపన్నపేట, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మనస్తాపం చెందిన ఓ మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం మండల పరిధిలోని అమ్రియా తండాలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. అమ్రియా తండాకు చెందిన లునావత్ లక్ష్మి(40) భర్త గోపాల్‌తో కలిసి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొన్ని రోజులుగా సంసార విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన లక్ష్మి గురువారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగింది. దీంతో కుటుంబీకులు వెంటనే గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి లాల్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తు తెలియని శవం లభ్యం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కోమటి చెరువు , దక్షిణ ద్వారం మత్తడి వద్ద గురువారం నీటిలో గుర్తుతెలియని శవం లభ్యమైంది. వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు కథనం ప్రకారం.. ఓ వ్యక్తి నీటిలో బోర్ల పడి ఉన్నందున, ముఖ భాగములు పెదవులు, ముక్కు, చెవులు, కండ్లు చేపలు తిని, కుళ్లిపోయి ఉబ్బి ఉంది. ఆ వ్యక్తి వయసు సుమారు 35-40 సంవత్సరాలు వరకు ఉంటుందని, వ్యక్తిపై డార్క్ గ్రే బ్లాక్ నైట్ ట్రాక్ పాంట్, ఆఫ్ హాండ్స్, కాలర్ పాకెట్ కలిగి ఉన్న పర్పుల్ కలర్ టీ -షర్టు ఉందని తెలిపారు. మృతుడి కుడి చేతికి మూడు వరసల జపమాల రాఖీ కట్టి ఉందన్నారు. ఎవరైనా శవంను గుర్తుపట్టిన యెడల, సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ వారికి సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్యాస్ లీకై వ్యక్తి మృతి

ఝరాసంగం,ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఝరాసంగం మండలంలోని ఏడాకులపల్లి గ్రామంలో ఈ నెల 6న గ్యాస్ సిలిండర్ లీకై గాయాలతో చికిత్స పొందుతూ గొర్రెకంటి ప్రభు(38) శుక్రవారం ఉదయం మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ప్రభు ఇంట్లో వంటగ్యాస్ లీక్ అవ్వడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజుల క్రితం తల్లి గొర్రెకంటి శంకరమ్మ కూడా ఇదే ఘటనలో మృతిచెందింది. మృతుడికి భార్య, 14నెలల కుమారుడున్నాడు. మృతుడి తండ్రి బక్కన్న ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి మృతి

గజ్వేల్ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): క్రిమిసంహారక మందు తాగి వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన క్యాసారంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సంగాని అంజనేయులు(46) గురువారం రోజున క్రిమిసంహారక మందు తాగాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

ఉమ్మడి మెదక్ జిల్లాలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట ప్రభుత్వ కార్యాలయాల్లో, పార్టీ ఆఫీసుల వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు.



సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు



నారాయణఖేడ్‌లో జెండా వందనం చేస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండా ఎగురవేస్తున్న ఎస్పీ పంకజ్



సంగారెడ్డి కలెక్టరేట్‌లో పతాకావిష్కరణ అనంతరం గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య



సంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో వందనం చేస్తున్న ప్రధాన న్యాయాధికారి భవానీచంద్ర, తదితరులు



నారాయణఖేడ్ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న సబ్‌కలెక్టర్ ఉమాహారతి



మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న అదనపు ఎస్పీ మహేందర్



మెదక్ కలెక్టరేట్‌లో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉద్యోగులకు ఉత్తమ అవార్డులు

ఉత్తమ సేవలు అందించిన వివిధ ప్రభుత్వ విభాగాల ఉద్యోగులకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అవార్డులను ఆయా జిల్లాల్లో మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు అందజేశారు. సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ అధికారులు, నర్సులు, పలువురు కార్మికులు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

సిద్దిపేట జిల్లా





సిద్దిపేటలో ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అగ్రవాల్

మెదక్ జిల్లా





మెదక్‌లో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి వివేక్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



సంగారెడ్డి జిల్లా



సంగారెడ్డిలో ప్రశంసాపత్రాలను అందజేస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పంకజ్, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి



తలకిందులుగా జాతీయ జెండా



టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద తలకిందులుగా ఎగురవేస్తున్న జెండా

చిన్నశంకరంపేట/టేక్మాల్/జోగిపేట రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో జాతీయ పతాకాలను తలకిందులుగా ఎగురవేసిన మూడు సంఘటనలు చోటు చేసుకున్నాయి. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు త్రివర్ణ పతాకాన్ని తలకిందులుగా ఆవిష్కరించారు. వెంటనే గమనించి ఉపాధ్యాయులు సరిచేశారు. అదేవిధంగా టేక్మాల్ ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రియాజొద్దీన్ జెండాను తలకిందులుగా ఎగురవేశారు. అధికారులు, నాయకులు గుర్తించి చెప్పడంతో తిరిగి ఎగురవేయగా మళ్లీ తలకిందులుగానే కనిపించింది. సంగారెడ్డి జిల్లా జోగిపేటలోని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య భవనం వద్ద అధికారిణి నిఖిత ఎగురవేసిన జెండా ఉదయం సరిగ్గానే ఉన్నప్పటికీ, మధ్యాహ్నం చూసేసరికి తలకిందులుగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు డెయిరీ సిబ్బంది చెప్పారు.

న్యూజిలాండ్‌లో డప్పు కళా ప్రదర్శన



న్యూజిలాండ్‌లో డప్పులతో అందె భాస్కర్ బృందం

మిరుదొడ్డి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను విశ్వవ్యాప్తం చేసేందుకు మిరుదొడ్డి మండలానికి చెందిన ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తన బృందంతో కలిసి శుక్రవారం న్యూజిలాండ్‌లో డప్పు కళా ప్రదర్శన ఇచ్చారు. న్యూజిలాండ్ ప్రభుత్వం ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కళా ప్రదర్శన అనంతరం న్యూజిలాండ్ కౌన్సిల్ జనరల్ డాక్టర్ మధన్ మోహన్‌శెట్టి ఆయనకు జ్ఞాపికను అందజేశారు.

పంద్రాగస్టు ఎరుగని అడ్డా కూలీలు!

పని కోసం పడిగాపులు

మెదక్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందడి నెలకొంది. కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ పతాకాలు రెపరెపలాడుతున్నాయి. అయితే, ఈ పండుగ వాతావరణం కూలీల బతుకుల్లో మాత్రం కనిపించడం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని దినసరి కూలీలకు ఈరోజు కూడా మరో సాధారణ పనిదినమే. పండుగ రోజున పని దొరుకుతుందో లేదోనని ఆందోళన చెందుతూ, మెదక్ పట్టణంలోని లేబర్ అడ్డాకు క్యూ కట్టారు.



పంద్రాగస్టున మెదక్‌లోని లేబర్ అడ్డాలో పనుల కోసం కూలీల ఎదురుచూపులు

మెదక్, రామాయంపేట, పాపన్నపేట, చేగుంట, చిన్నశంకరంపేటతో పాటు కామారెడ్డి జిల్లా నుంచి కూడా వందలాది మంది కూలీలు పనుల కోసం నిత్యం మెదక్ లేబర్ అడ్డాకు వస్తుంటారు. సాధారణంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా జరిగే తరుణంలో కూలీల కొరత ఉంటుంది. కానీ, పంట పెట్టుబడులు, అతివృష్టి, అనావృష్టి వంటి కారణాల వల్ల వ్యవసాయం కంటే కూలీ పనులకు వెళ్లడమే నయమని భావిస్తూ చిన్న, సన్నకారు రైతులు కూడా అడ్డా బాట పడుతున్నారు.

పని లేకుంటే పస్తులు



పండగ అని కూర్చుంటే పొట్ట ఎలా గడుస్తుంది? కారం మెతుకులతో కూడా భోజనం దొరకని పరిస్థితి మాది. పండుగ సంబరాల్లో పాల్గొనాలని ఉన్నా, పని దొరక్కపోతే పస్తులు ఉండాల్సి వస్తుంది.

- వడ్డెర వెంకయ్య, అడ్డా కూలీ

మూడు రోజులే పని



అడ్డా మీద కూలీలు ఎక్కువై, పనికి పోటీ పెరిగింది. వారంలో మూడు రోజులే పని దొరుకుతోంది. మిగతా రోజులు ఖాళీగా ఉండాల్సి వస్తోంది. వయసు మీద పడుతున్నా, కష్టపడితే తప్ప జీవితం సాగని పరిస్థితి.

- అంజయ్య, అడ్డా కూలీ





తొగుట మండలం వెంకట్రావ్‌పేటలో క్యూ కట్టిన రైతన్నలు, చిన్నశంకరంపేట మండలం మడూర్ సొసైటీ కార్యాలయం వద్ద ఎగబడుతున్న రైతులు

యూరియా కోసం బారులు

మిరుదొడ్డి/తొగుట/చిన్నశంకరంపేట/మనోహరాబాద్/మాసాయిపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి, తొగుట, మెదక్ జిల్లా చిన్నశంకరంపేట, మనోహరాబాద్ మండలాల్లోని ఎరువుల దుకాణాల వద్ద రైతులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. మిరుదొడ్డిలో పీఏసీఎస్ కేంద్రం వద్ద ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు సముదాయించగా, తొగుటలో ఒక రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ మాసాయిపేటలోని రైతు ఆగ్రో కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెల్లాపూర్‌లో కొలువైన మీసాల కృష్ణయ్య

నేడు కృష్ణాష్టమి

దుబ్బాక, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో అరుదుగా కనిపించే మీసాల కృష్ణుడు సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో కొలువుదీరి భక్తుల నమ్మకాలకు ప్రతీకగా నిలిచారు. కరువులో వెలిసిన ఈ దేవదేవుడు, నేటికీ ఆ ప్రాంత ప్రజల జటిలమైన వివాదాలను పరిష్కరించే దైవంగా పూజలందుకుంటున్నాడు.



చెల్లాపూర్ ఆలయంలోని మీసాల కృష్ణుడు

కరువులో ఆలయ నిర్మాణం

సుమారు 600 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతాన్ని కరువు పట్టి పీడించగా, భూస్వాముల పన్నుల వేధింపుల నుంచి తప్పించుకోవడానికి వారి నుంచే నిధులు సమీకరించి గ్రామస్థులు ఈ ఆలయం నిర్మించారని ప్రతీతి. ఇక్కడి మీసాల కృష్ణుడి సన్నిధిలో అసత్యాలకు తావుండదని స్థానికుల ప్రగాఢ విశ్వాసం. ఎటువంటి వివాదాలు వచ్చినా ఆలయం మెట్లపై ప్రమాణం చేస్తే సత్యం బయటపడుతుందని వారు నమ్ముతారు. అందుకే ఈ ప్రాంత ప్రజలు ఎంతటి జటిలమైన సమస్యలనైనా ఇక్కడే పరిష్కరించుకుంటారు. ఆలయంలో నిరంతరం వెలిగే అఖండ దీపం కూడా స్వామివారి మహిమకు, సత్యానికి నిదర్శనమని భక్తులు నమ్మకం.

మీసాలెలా వచ్చాయంటే..

ఆలయ నిర్మాణం పూర్తయిన తర్వాత విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి గ్రామస్థులు సిద్ధమయ్యారు. విగ్రహం దొంగతనం అయ్యిందని రాజగోపాల్‌పేట గ్రామస్థులు వెతుకుతున్నారని తెలిసి, దొరికిపోతామన్న భయంతో శ్రీకృష్ణుడి విగ్రహానికి వెండి మీసాలు అతికించారు. తలపై ఉన్న కొప్పును తీసి కిరీటం పెట్టారు. దీంతో ఈ స్వామి మీసాల కృష్ణుడుగా ప్రసిద్ధి చెందారు.



అబ్బురపరిచిన హరివిల్లు

జహీరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లోని బాబానగర్ వాసులను హరివిల్లు అబ్బురపరిచింది. శుక్రవారం నల్లని మేఘాల మధ్య ఏర్పడిన ఇంద్రధనుస్సు చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు.

జల పరవళ్లు

పుల్‌కల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద పోటెత్తుతున్నది. శుక్రవారం 11,083 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో నమోదైంది. 8, 9, 11వ నంబర్ క్రస్ట్‌గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. గేట్ల ద్వారా 25,433 క్యూసెక్కులు, జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని రెండు టర్బైన్ల ద్వారా 2,491 క్యూసెక్కులు వెళ్తున్నాయి. మొత్తం 28,557 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో నమోదైంది. సంగారెడ్డి సమీపన ఉన్న మంజీర జలాశయం రెండు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఇన్‌ఫ్లో 10,184 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 9,906 క్యూసెక్కులుగా నమోదైంది.



సింగూరు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న జలాలు

న్యూస్ బాక్స్

19 నుంచి ఉపకరణాల పంపిణీకి అర్హుల గుర్తింపు

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కోసం గుర్తింపు, నిర్ధారణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సమగ్ర శిక్ష, ఆలింకో సంయుక్తంగా ఈ నెల 19న నారాయణఖేడ్, 20న సంగారెడ్డి, 21న జహీరాబాద్‌లోని భవిత కేంద్రాల ఆవరణలో ఈ శిబిరాలు జరగనున్నాయి. 18 ఏళ్ల లోపు ఉన్న దివ్యాంగులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, సదరం సర్టిఫికేట్, రెండు ఫొటోలతో శిబిరానికి రావాలని ఆయన సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ-కేవైసీ రద్దు చేయాలి

నారాయణఖేడ్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశపెట్టిన ఈ-కేవైసీ, ఫేస్ క్యాప్చరింగ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. నెట్‌వర్క్ సమస్యల కారణంగా అంగన్‌వాడీ టీచర్లు, లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. టీచర్లకు 5జీ ఫోన్లు ఇచ్చాకే ఈ విధానాన్ని అమలు చేయాలని ఆయన కోరారు. ఎన్నికల హామీ ప్రకారం టీచర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ కార్యదర్శి నిలదీత

నారాయణఖేడ్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సమస్యలను పరిష్కరించడం లేదంటూ నారాయణఖేడ్ మండలం నర్సాపూర్ గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణను నిలదీశారు. గ్రామంలో చెత్త పేరుకుపోవడం, దోమల బెడద, చెత్తబండి రాకపోవడం వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నిధులు లేకపోవడం వల్ల పనులు చేయలేకపోయామని, నిధులు రాగానే సమస్యలు పరిష్కరిస్తామని కార్యదర్శి సమాధానం ఇచ్చారు.

తూప్రాన్‌లో ఐఐటీ ఫౌండేషన్ కోర్సు

తూప్రాన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణంలోని బాలుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐఐటీ ఫౌండేషన్ కోర్సును స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు ఎంఈవో, హెచ్ఎం డా. పర్వతి సత్యనారాయణ తెలిపారు. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ కోర్సును కలెక్టర్ రాహుల్‌రాజ్, డీఈవో డా. రాధాకిషన్ ప్రారంభిస్తారని తెలిపారు.

సీసీ కెమెరాల అందజేత

సదాశివపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సదాశివపేట మండలం నిజాంపూర్ గ్రామంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య ఆధ్వర్యంలో జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గ్రామ ప్రజలకు సీసీ కెమెరాలను అందజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వీటిని అందజేస్తున్నామని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే తెలంగాణ రూపురేఖలు మారుతాయని గోదావరి అంజిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, మాణిక్‌రావు, ముత్తిరెడ్డి, పోచారం రాములు, నామ హరీష్, సారక్రిష్ణ, అంబదాస్, శ్రీకాంతరాజ్, నీలేష్, దుర్గారాజ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

జిన్నారం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. శుక్రవారం కొడకంచి దక్కన్ ఆటో పరిశ్రమ వద్ద సీఐటీయూ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. దక్కన్ ఆటో పరిశ్రమ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ యూనియన్ అధ్యక్షుడు రాజయ్య, నాయకులు పోచయ్య, శ్రీనివాస్, తుకారాం, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రం ప్రారంభం

జిన్నారం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిన్నారం మండలం నల్తూరు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో హెటిరో పరిశ్రమ లక్ష రూపాయల సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశ్రమ ప్రతినిధి రవిబాబు ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు, స్థానికుల కోసం ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రామ మాజీ సర్పంచ్ జనార్దన్ తెలిపారు.

రేగోడులో చోరీకి యత్నం

రేగోడు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రేగోడు గ్రామపంచాయతీ భవనానికి రంధ్రం చేసి చోరీకి యత్నించినట్లు అనుమానిస్తున్నారు. శుక్రవారం ఉదయం పంచాయతీ సిబ్బంది కార్యాలయం వద్దకు వెళ్లగా గోడకు రంధ్రం కనిపించింది. దీనిపై పంచాయతీ కార్యదర్శి అరుణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏదైనా ప్రభుత్వ ఆస్తి నష్టం జరిగిందా అని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

త్రివర్ణ శోభితం

- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం
- వాడవాడలా రెపరెపలాడిన జాతీయ జెండా

న్యూస్ నెట్‌వర్క్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, అన్ని గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పోలీస్ సిబ్బంది, నాయకులు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులు దేశభక్తి పాటలు, నృత్యాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పలువురు నాయకులు, అధికారులు పిలుపునిచ్చారు. పలుచోట్ల నిర్వహించిన విద్యార్థుల త్రివర్ణ పతాక ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు మహనీయుల వేషధారణలో అలరించారు.


మెదక్ కల్చరల్ : త్రివర్ణ పతకాన్ని ఎగురవేస్తున్న జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత దేవి


సంగారెడ్డిలోని విద్యానగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో చైర్మన్ ఆంథోనీరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రమీల



సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో స్వాతంత్ర్య వేడుకల్లో విద్యాసంస్థల అధినేత సోలోమోన్‌రెడ్డి


రేగోడు రెవెన్యూ కార్యాలయం వద్ద జండా ఎగురవేస్తున్న తహసీల్దార్ దత్తారెడ్డి


గీతం విశ్వవిద్యాలయంలో స్వాంతంత్ర్య వేడుకలు..


జహీరాబాద్ : క్యాంపు కార్యాలయంలో జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తదితరులు


సంగారెడ్డి ప్రశాంత్‌నగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో జాతీయ జెండా ఎగురవేస్తున్న ప్రిన్సిపాల్ ధన్‌రాజ్


సదాశివపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న తహసీల్దార్ కె.సరస్వతి


సదాశివ పట్టణం 12వ వార్డులో జాతీయ జెండాను ఎగురవేస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడిరాజు



మెదక్ అర్బన్ : స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సిద్దార్థ్ విద్యా సంస్థల అధినేత శ్రీనివాస్ చౌదరి


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


కోహీర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది నాయకులు


టేక్మాల్ : తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ తులసీరామ్


సంగారెడ్డిలోని కెమిస్ట్ భవన్‌లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నాయకులు


వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ పతకాన్ని ఎగురవేస్తున్న తహసీల్దార్ బాలలక్ష్మి


జహీరాబాద్ : జాతీయజెండాను ఎగురవేస్తున్న ఆర్డీవో రాంరెడ్డి

తండాల రూపురేఖలు మారుస్తాం

- ఎమ్మెల్యే రోహిత్ రావు

రామాయంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని తండాల రూపురేఖలు మారుస్తానని, మరో మూడేళ్లలో మట్టి రోడ్లు లేకుండా తారు రోడ్లు వేయిస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు తెలిపారు. శుక్రవారం రామాయంపేట మండలం జమ్లా తండాలో గిరిజనుల గురువు ప్రేమ్‌సింగ్ మహరాజ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్ల పాలన అబద్ధాల పునాదిగా నడిచిందని విమర్శించారు. అభివృద్ధి చేయడం ఒక్కటే తనకు తెలుసని, దశాబ్ద కాలంగా వెనుకబడిన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, దేమే యాదగిరి, మహేందర్‌రెడ్డి, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం ఇస్తేనే భూముల్లోకి రండి'


ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న రైతులు

ఝరాసంగం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నష్టపరిహారం ఇవ్వకుండా భూముల్లోకి వచ్చి పనులు చేపట్టడం సరికాదని ఝరాసంగం మండలం ఎల్గోయి గ్రామ రైతులు అటవీ శాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిమ్జ్ ప్రాజెక్ట్ కోసం తమ పట్టా భూములను సేకరించినా, కొంతమందికి ఇప్పటికీ నష్టపరిహారం అందలేదని తెలిపారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, మొక్కలు నాటడం సమంజసం కాదని రైతులు ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్నారు. పరిహారం ఇవ్వని భూముల జోలికి వస్తే తరిమికొడతామని హెచ్చరించారు.

ఇంటర్ టాపర్‌కు ప్రోత్సాహక బహుమతి


ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న విద్యార్థి విక్రమ్

చిన్నశంకరంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చిన్నశంకరంపేటలోని తెలంగాణ ఆదర్శ జూనియర్ కళాశాల ఇంటర్ విద్యార్థి ఉప్పరి విక్రమ్ వార్షిక పరీక్షల్లో జిల్లా టాపర్‌గా నిలిచాడు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెదక్ కలెక్టరేట్‌లో ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే రోహిత్ రావు చేతుల మీదుగా రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందుకున్నాడు.

మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలి రాజీనామా

- పీసీసీ అధ్యక్షుడికి లేఖ



రాజీనామా పత్రాన్ని చూపుతున్న భవానీ

పెద్దశంకరంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అవుసుల భవానీ తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. పెద్దశంకరంపేటలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియామకమైనప్పటి నుంచి తనకు పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడం లేదని, పార్టీ నిర్వహించే కార్యక్రమాల సమాచారం కూడా ఇవ్వకపోవడం తనపై వివక్ష చూపించినట్లు కదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయం కోసం ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి మరీ ఓట్లు అడిగి, వారి విజయం కోసం ఎంతగానో పని చేశారనని చెప్పారు. తన రాజీనామా పత్రాన్ని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మొగిలి సునీతకు ఫ్యాక్స్ ద్వారా పంపుతున్నట్లు తెలిపారు.

పెచ్చులూడిన పశువుల ఆసుపత్రి భవనం స్లాబ్


పెచ్చులూడిన స్లాబ్

చేగుంట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు చేగుంట మండలం మక్కరాజుపేటలోని పశువుల ఆసుపత్రి భవనం స్లాబ్ పెచ్చులు ఊడిపడ్డాయి. ఈ ఘటన జరిగినప్పుడు ఆసుపత్రిలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఈ భవనం కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉందని, ఇప్పుడు వర్షాల కారణంగా స్లాబ్ కూలిందని లైవ్‌స్టాక్ అసిస్టెంట్ రాజారెడ్డి తెలిపారు. ఈ ఆసుపత్రి పరిధిలో సుమారు 8 గ్రామాల ప్రజలు పశువుల వైద్యం కోసం వస్తుంటారు.

'ఓర్వలేకే కాంగ్రెస్ దాడులు'

పెద్దశంకరంపేట, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వ్యక్తిగత దాడులకు పాల్పడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. పెద్దశంకరంపేటలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్ నివాసంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల క్రితం తనపై, శ్రీనివాస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి ప్రయత్నించారన్నారు.

యువత ప్రతిజ్ఞ

మనోహరాబాద్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ మండలం పర్కిబండ గ్రామంలో పోలీసులు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో గ్రామ యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో ఎవరైనా డ్రగ్స్ తీసుకుంటున్నట్లు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కార్యదర్శి నాగరాజు తెలిపారు. గ్రామ యువకులు డ్రగ్స్‌ను నిర్మూలించడానికి తాము కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కాలుష్యంపై అవగాహన పెంచుకోవాలి

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



2కే రన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కాలుష్య ప్రభావిత గ్రామాల్లోని ప్రజలు రసాయనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరులో ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొల్యూషన్ ఫ్రీ పటాన్‌చెరు 2కే రన్'ను ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలుష్య రహిత పట్టణంగా మార్చడానికి ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడెం మధుసూదన్‌రెడ్డి, అశోక్, పోచారం కృష్ణ, ఆంజనేయులు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రేశం రోడ్డు మరమ్మతులకు రూ.30 లక్షలు

పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి వెళ్లే రోడ్డు మరమ్మతుల కోసం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సొంతంగా రూ.30 లక్షలు విరాళంగా ఇచ్చారు. శుక్రవారం రోడ్లు భవనాల శాఖ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు.

వరదలతో అప్రమత్తంగా ఉండాలి

కల్హేర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాబోయే నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఎస్ఐ మధుసూదనరెడ్డి సూచించారు. శుక్రవారం వారు మీర్‌ఖాన్‌పేట వాగుపై ఉన్న వంతెనను పరిశీలించి, రెయిలింగ్ లేకపోవడంతో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. ఏదైనా సమస్యలు వస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఆర్ఐ మల్లేశం తదితరులు ఉన్నారు.

వర్షానికి దెబ్బతిన్న పంటల పరిశీలన


వట్‌పల్లిలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రెడ్డి

వట్‌పల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గత రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వట్‌పల్లి మండలంలోని గొర్రెకల్, నాగులపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు. నష్ట వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.